సాక్షి
జోగుళాంబ గద్వాల

మంగళవారం । 3 । జనవరి । 2023

డిగ్రీ పరీక్షలు ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ...డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49పరీక్ష కేంద్రాల్లో 10,087 మంది విద్యార్థులు హాజరయ్యారు.



నేటితో ముగింపు

ఎస్‌ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /19.3

వాతావరణం

రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. రాత్రివేళ చలి తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

న్యాయ సేవలు మరింత చేరువ



గద్వాల క్రైం: న్యాయ సలహాలు, సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసిందని జిల్లా జడ్జి కనకదుర్గ అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 24 నూతన లీగల్ సర్వీసెస్ సంస్థలను రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జస్టిస్) ఉజ్జల్ భూయన్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, హై కోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈమేరకు జిల్లా కోర్టు ఆవరణలోని నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ.. కక్షిదారులు న్యాయ సేవలు, సలహాలు నిపుణులైన న్యాయవాదుల నుంచి తెలుసుకునేందుకు దోహదం పడుతుందన్నారు. సేవాధికార సంస్థ ద్వారా ప్రతి రోజు లోక్ అదాలత్ నిర్వహించి కేసుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారన్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, అన్యాయానికి గురైన వారు ఎవరైన ఆక్కడ సంప్రదించవచ్చన్నారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం న్యాయశాఖ విశేష సేవలను, సంస్కరణలు అమలు చేసిందన్నారు. అడిషనల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, న్యాయమూర్తులు అనిరోజ్ క్రిష్టియన్, గంట కవితాదేవి, ప్రభాకర్, గాయత్రీ, ఎస్పీ రంజన్‌రతన్ కుమార్, డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్, అదనపు ఎపిపిలు రెచ్చల్ సంజన జాషువ, భవని, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా జిల్లా వాసి

గట్టు: స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఆంజనేయగౌడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గట్టు మండలం ఆలూరు చెందిన ఆంజనేయగౌడ్ రాష్ట్ర స్థాయిలో నామినేటేడ్ పదవి లభించడంపై గ్రామస్తులతో పాటుగా జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నియామక పత్రాన్ని ప్రగతి భవన్‌లో సీఎం చేతుల మీదుగా ఆంజనేయగౌడ్ సోమవారం అందుకున్నారు.

వేరుశనగ @ రూ.7,812

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు సోమవారం 538 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్టం రూ.7812, కనిష్టం రూ. 4129, సరాసరి రూ. 6370 ధరలు లభించాయి. అలాగే, ఆముదం గరిష్టం రూ. 6326, కనిష్టం రూ.5920 ధర పలికింది.

సహకారం.. పక్కదారి!

వ్యవసాయ సహకార సంఘాల్లో సిబ్బంది చేతివాటం



వడ్డేపల్లి సొసైటీ ద్వారా పిట్టి రుణాలు అందచేస్తున్న అధికారులు (ఫైల్)

- పిట్టీ లోన్స్ వసూలు చేసి.. సొంతానికి వాడేసుకున్న ఉద్యోగులు
- లబ్ధిదారులతో మాట్లాడి బయటకు పొక్కకుండా చేసిన వైనం

జిల్లాలో ఆయా సంఘాల ద్వారా అందిన రుణాలు ఇలా..

సంఘం పేరు	అందించిన రుణం	పెండింగ్‌లో ఉన్న రుణ బకాయి
ధరూర్	రూ.1.5కోట్లు	రూ.80లక్షలు
అయిజ	రూ.19లక్షలు	రూ.8లక్షలు
గద్వాల	రూ.14లక్షలు	రూ.9లక్షలు
వడ్డేపల్లి	రూ.24లక్షలు	రూ.3.50లక్షలు
కలుగొట్ల	రూ.61.50లక్షలు	రూ.15.72లక్షలు

రాజోళి: వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందాల్సిన సహకారం పక్కదారి పడుతుంది. పక్కదారి పట్టిన సొమ్ములో సాక్ష్యాత్తు పీఏసీఎస్ సిబ్బందే ఉండటం గమనార్హం. ఇప్పటికే ఫర్టిలైజర్ సొమ్మును వాడుకున్నారని, జిల్లాలో సహకార సంఘాలపై వచ్చిన కథనాలను మరువక ముందే, తాజాగా సూక్ష్మరుణాలు(పిట్టి లోన్స్) ద్వారా కూడా తమ చేతి వాటం చూపినట్లు 'సాక్షి' పరిశోధనలో వెల్లడైంది. గతంలో పనిచేసిన, ప్రస్తుతం తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మొదలుకుని, మరికొందరు రాజకీయ పలుకుబడి ఉన్న వారు కూడా ఈ ప్రక్రియలో భాగం పంచుకున్నట్లు తెలుస్తుంది. కాగా జిల్లాలో రూ.కోట్లలో రుణాలు అందించగా పలు కారణాలతో ఇంకా వసూళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయా సొసైటీల అధికారులు చెబుతున్నారు. కానీ ఆ పెండింగ్‌లోనే అసలు కథ దాగుందని తెలుస్తుంది.

సూక్ష్మరుణాల పేరుతో సహాయం

కరోనా విపత్తుతో దెబ్బతిన్న వ్యాపారులను ఆదుకునేందుకు 2021లో పిట్టి లోన్స్ పేరుతో పీఏసీఎస్ ద్వారా వ్యాపారులకు ష్యూరిటీల ఆధారంగా వారి వ్యాపార స్తోమతను బట్టి రుణాలను అందచేశారు. కాగా వ్యాపారుల నుంచి రుణాలను వసూలు చేసే బాధ్యత కూడా పీఏసీఎస్ సిబ్బంది బాధ్యత కాగా, వారు దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారుల నుంచి చేసిన వసూళ్లను నేరుగా రుణాలు ఇచ్చిన బ్యాంకులకు చెల్లించకుండా, తమ సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో కొందరు వ్యాపారులు తమ రుణం పూర్తిగా చెల్లించినప్పటికీ వారు ష్యూరిటీగా పెట్టిన పత్రాలు ఇవ్వకపోవడంతో బ్యాంకు అధికారులను కలిసి విన్నవించారు. తాము రెగ్యులర్‌గా చెల్లింపులు చేస్తున్నామని చెప్పడంతో విషయం బయటకు పొక్కింది.

ఆ సొసైటీపైనే ప్రధాన ఆరోపణలు

జిల్లాలోని వడ్డేపల్లి సహకార సొసైటీపైనే ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని ఆధారంగా విచారణ చేయగా, పీఏసీఎస్ సిబ్బంది వసూలు చేసిన సొమ్మును వాడుకున్నది వాస్తవేమని, కాకపోతే, కొద్ది సొమ్మునే వాడుకున్నామని, త్వరలో తిరిగి బ్యాంకుకు చెల్లిస్తామని చెప్పడం విశేషం. గతంలో కూడా ఫర్టిలైజర్ సొమ్మును చెల్లించకుండా సిబ్బంది, ఒక ప్రధాన నాయకుడు వాడుకున్నారని, 'సాక్షి'లో వచ్చిన కథనాల మేరకు, వాడుకున్న సొమ్మును చెల్లించేశారు. అది జరిగినప్పటి నుండే సూక్ష్మ రుణాల అంశంపై బయటకు వచ్చినట్లు సమాచారం. మీరు లోన్ డబ్బులు బ్యాంకుల్లో కట్టకుండా వాడుకుంటున్నారు కదా అని సదరు కార్యాలయంలోని సిబ్బంది మధ్య చిన్న పాటి యుద్దమే జరిగనట్లు సమాచారం. దాని వల్లనే విషయం మరింతగా బయటకు తెలిసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పాత సీఈఓ ఉన్నపుడు జరిగింది..

గతంలో సీఈఓ ఉన్నప్పుడే ఈ పిట్టి లోన్స్ వసూళ్లను వాడుకోవడం జరిగింది. మా దృష్టికి ఈ విషయం వచ్చినప్పటి నుంచి ఈ అంశంపై చర్చించాం. వెంటనే ఆ డబ్బు చెల్లించేలా చేశాం. నేను సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటికే ఈ పిట్టి లోన్ వసూళ్ల డబ్బును వాడుకున్నట్లుగా తెలిసింది. ఈ డిసెంబర్‌లో రూ.40 వేల వరకు చెల్లించాం.

– రవి, సీఈఓ, వడ్డేపల్లి సొసైటీ

పత్రాలు తిరిగి ఇచ్చాం

వ్యాపారులకు కరోనా విపత్తు సమయంలో పిట్టీ రుణాలు ఇచ్చాం. కాగా ఆ రుణాల కోసం వ్యాపారుల నుంచి ష్యూరిటీగా పత్రాలు పెట్టుకున్నాం. కాగా వారు చెల్లించాల్సిన నగదు మొత్తం చెల్లించినప్పటికీ, తమ పత్రాలు రాలేదని వ్యాపారులు చెప్పారు. వెంటనే సొసైటీ అధికారులతో విచారణ చేసి రుణ బకాయి పూర్తిగా చెల్లించిన వ్యాపారులకు ష్యూరిటీగా పెట్టిన పత్రాలు తిరిగి ఇచ్చేశాం.

– జితేందర్, డీసీసీబీ మేనేజర్



పిట్టి రుణాలకు సంబంధించి చెక్కు అందజేస్తూ..

పొంతన లేని సమాధానాలు...

ఈ విషయమై ఇటు పీఏసీఎస్ సిబ్బందిని, అటు డీసీసీబీ బ్యాంకు సిబ్బందిని ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. కానీ ఇరువురు చెప్పిన మాటల్లో మాత్రం డబ్బు వాడుకున్నది నిజమని, చెల్లిస్తామని అంటున్నారు. అయితే ఒక్క వడ్డేపల్లి సొసైటీలో రూ.24 లక్షల రుణం ఇవ్వగా ఇప్పటికి గడిచిన కాలంలో ఎంత నగదును వాడుకుని, వారి అవసరాలు గడుపుకున్నారో అని వ్యాపారులు అంటున్నారు. అయితే ఇదే సొసైటీలో నేటికి రూ.3లక్షలకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్న అధికారులు, వ్యాపారుల నుండి ఇప్పటి దాకా వసూలు చేసి వాడుకున్నది కొంత మొత్తమేనని చెప్పడం విడ్డూరం. ప్రజల సొమ్మును సక్రమంగా చెల్లించకుండా వారి సొంత అవసరాలకు వాడుకోవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిని బట్టి చూస్తే ఇటు బ్యాంకుకు, అటు వ్యాపారులు ఎంత మేర నష్టం వాటిల్లుతుందోనని.. ఇంకా జిల్లా మొత్తంలో ఇలాంటి ఎన్ని చోటు చేసుకుంటున్నాయోనని అనుమానాలు కలుగుతున్నాయి. కాగా జిల్లా అధికారులు ప్రతి సొసైటీ ద్వారా అందించిన రుణాల వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోటెత్తిన భక్తులు..



కేటిదొడ్డి మండలం వెంకటాపూర్‌లోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తుల క్యూ

ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రధానంగా అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి, బీచుపల్లి పుణ్యక్షేత్రం, కేటిదొడ్డి మండలం వెంకటాపూర్‌లోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి, తదితర ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు, ప్రసాదంతోపాటు అన్నదానాలు నిర్వహించారు.

– కేటీదొడ్డి/ఎర్రవల్లిచౌరస్తా

'రుణ' కబురు

ఎట్టకేలకు ఉమ్మడి జిల్లాకు 339 రుణ యూనిట్ల కేటాయింపు

- రూ.లక్షకు 80 శాతం, రూ.2 లక్షలకు 70 శాతం సబ్సిడీ
- అదనంగా రూ.70 కోట్లతో పెరగనున్న మరిన్ని యూనిట్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మైనార్టీ నిరుద్యోగ యువత
- ఇప్పటికే వేలాది మంది దరఖాస్తుల పెండింగ్

జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా..

జిల్లా	కేటగిరి-1	కేటగిరి-2
మహబూబ్‌నగర్	85	36
జోగుళాంబ గద్వాల	40	17
నాగర్‌కర్నూల్	41	17
నారాయణపేట	37	16
వనపర్తి	35	15

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వయం ఉపాధితో వ్యాపారాలు చేసుకొని జీవితంలో స్థిరపడాలనుకున్న మైనార్టీ నిరుద్యోగ యువతకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు తెలిపింది. చివరిసారిగా 2015-16 సంవత్సరంలో మైనార్టీ యువతకు సబ్సిడీ రుణాలు అందజేయగా.. తాజాగా 2022- 23 ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు శ్రీకారం చుట్టారు. అయితే ఇప్పటికే వేలాది మంది దరఖాస్తు చేసుకోగా.. తాజా ప్రకటనతో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాకు రెండు కేటగిరీల్లో..

రెండు కేటగిరీల్లో మైనార్టీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నారు. కేటగిరి-1లో రూ.లక్ష రుణానికి 80 శాతం సబ్సిడీ, కేటగిరి-2లో రూ.2 లక్షలకు 70 శాతం సబ్సిడీతో రుణం అందజేస్తారు. 5 వేల యూనిట్లను జిల్లాల వారీగా మైనార్టీల జనాభా ప్రకారం యూనిట్లు కేటాయించినట్లు తెలుస్తుంది. ఇందులో ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేటగిరి-1లో 238, కేటగిరి- 2లో 101 యూనిట్లు కేటాయించారు. అత్యధికంగా మహబూబ్‌నగర్‌కు 121 వచ్చాయి. అయితే మైనార్టీ సబ్సిడీ రుణాలకు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.70 కోట్లు కేటాయించింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 12 వేల మంది మైనార్టీ యువతకు సబ్సిడీ రుణాలు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు దాదాపు 350 నుంచి 400 యూనిట్లు అదనంగా కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సబ్సిడీ రుణాలతో ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ యువతకు ఎంతో మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే వేలల్లో సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూనిట్లు మంజూరు చేయడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇవీ అర్హతలు..

సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారుల వయస్సు 21– 55 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రామీణ ప్రాంత కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలు ఉండాలి. తెల్లరేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు), ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం ద్వారా అర్హతగల వారు టీఎస్‌ఓబీఎంఎంఎస్ కాదు — bmmr.cff.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

రాష్ట్రవ్యాప్తంగా 12 వేల మంది..



మైనార్టీ సబ్సిడీ రుణాల విషయమై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. సబ్సిడీ రుణాల కోసం మొదటి విడతలో రూ.50 కోట్లు, రెండో విడతలో రూ.70 కోట్లు నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 12 వేల మంది యువతకు సబ్సిడీ రుణాలు అందుతాయి. ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హులకు రుణాలు అందజేస్తాం. రుణాలు పొందినవారు స్వయం ఉపాధి ఏర్పరుచుకొని జీవితంలో స్థిరపడాలి. ఇక నుంచి ప్రతి ఏడాది మైనార్టీ సబ్సిడీ రుణాలు మంజూరవుతాయి.

– ఇంతియాజ్ ఇసాక్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

యువతకు ఉపాధి అవకాశాలు..



సబ్సిడీ రుణాల మంజూరుతో మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా మైనార్టీ చిరు వ్యాపారులు కరోనాతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యాపారాలు చేసుకోవడానికి పెట్టుబడి పెట్టలేక ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రుణాలతో చిరువ్యాపారులకు ఎంతో వెసులుబాటు లభించనుంది. మైనార్టీ సబ్సిడీ రుణాలు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– మోసిన్‌ఖాన్, టీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు, మహబూబ్‌నగర్

కోతలు.. వెతలు

- వ్యవసాయానికి రాత్రి పూట విద్యుత్ సరఫరా నిలిపివేత
- పగలు ఓవర్ లోడ్ సాకుతో ఎడా పెడా కోతలు
- పంటలు ఎలా కాపాడుకోవాలని రైతుల ఆవేదన
- గట్టు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన
- దాదాపు 4వేల ఎకరాల్లో పంటలకు పొంచి ఉన్న ముప్పు



గట్టు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గట్టు: వేసవి రాకముందే రైతులను విద్యుత్ రూపంలో కష్టాలు చుట్టుముట్టాయి. ఓ వైపు ప్రజాప్రతినిధులు వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతుంటే.. క్షేత్రస్థాయికి వచ్చే సరికి అవి నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. గట్టు మండలంలోని చాలా గ్రామాల్లో ఎన్నో ఆశలతో యాసంగి సీజన్‌లో రైతులు పంటలు సాగుచేశారు. తీరా పంటలు వేశాక.. ఎడా పెడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పంటలు చేతికి అందుతాయా లేదా అని దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో పంటల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. సోమవారం గట్టు, యల్లందొడ్డి, రాయాపురం గ్రామాలకు చెందిన రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర విద్యుత్ కోతలపై ఆందోళనకు దిగారు.

యాసంగి సీజన్‌లో విస్తృతంగా సాగు

యాసింగి సీజన్‌లో బోర్లు, బావులు, కాల్వలకు విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తోడేసుకుంటూ గట్టు మండలంలో పంటలు విస్తృతంగా సాగు చేశారు. వేరుశనగ 5,250 ఎకరాల్లో, వరి 2250, పొగాకు 950, ఆముదాలు 150, కందులు 50 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ప్రస్తుతానికి వచ్చేసరికి 8,650 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. మార్చి, ఏప్రిల్ వరకు పంటలకు మోటార్ల ద్వారా నిరంతరం నీటిని అందిస్తేనే పంటలు చేతికందుతాయి. గట్టు, మాచర్ల, మిట్టదొడ్డి, గొర్లఖాన్‌దొడ్డి, ఆలూరు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. నెట్టంపాడు కాల్వల ద్వారా పెంచికలపాడు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, గట్టు, మాచర్ల, బల్గెర, ఇందువాసి గ్రామాలకు సాగు నీటిని అందిస్తున్నారు. దీంతో పాటుగా బోర్లు, బావుల ద్వారా రైతులు ఇప్పటికే యాసంగిలో వరి, వేరుశనగ పంటలను సాగు చేసుకున్నారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన వేరుశనగ పంటకు బిందు సేద్యం(స్ప్రింక్లర్) పరికరాల ద్వారా నీటి తడులను అందిస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరాను కుదించడంతో పాటుగా పగటి పూట అనధికారికంగా కోతలు విధిస్తున్న తరుణంలో పంటలను సాగు చేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

సబ్ స్టేషన్ వద్ద ఆందోళన

విద్యుత్ కోతలకు నిరసనగా సోమవారం గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు గట్టులోని విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర ఆందోళన చేపట్టారు. గట్టు, యల్లందొడ్డి, రాయాపురంతొ పాటుగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు. గతంలో రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేసే వారని, ఇలా అయినా అమలు చేస్తే పంటలు చేతికొస్తాయని లేని పక్షంలో పంటలను ఎండగొట్టుకోవడం ఖాయమన్నారు. అధికారులెవరు అందుబాటులొ లేక పోవడంతో స్థానికంగా ఉన్న లైన్‌మెన్‌కు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇదిలాఉండగా, కోతలపై నోరు విప్పకపోవడంతోపాటు.. కోతలు అంతటా అమలు చేస్తున్నట్లు విద్యుత్ ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

గట్టు మండలంలోనే కోతలు అమలు

గద్వాల నియోజక వర్గంలో గట్టు మండలంలోనే వ్యవసాయానికి రాత్రి పూట విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపి వేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పక్కనే ఉన్న మండలాల్లోని సరిహద్దు గ్రామాల్లో రాత్రి పూట వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. కేవలం ఇక్కడే ఇష్టానుసారంగా కోతలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. మొత్తం 8,650 ఎకరాల్లో దాదాపు 40శాతం పంటలకు ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే విద్యుత్ కోతల గురించి చెప్పి ఉంటే యాసంగి సాగుకు విరామం ఇచ్చేవాళ్లమని, పంటలు సాగు చేసుకున్నాక, ముందస్తు సమాచారం లేకుండా కోతలు పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కోతలతో ఇబ్బందిగా ఉంది



సేద్యానికి రాత్రి పూట కరెంట్ సరఫరాను పూర్తిగా బందు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా మాత్రమే కరెంట్ సరఫరా చేస్తున్నారు. మధ్య మధ్యలో చెప్పా,పెట్టకుండా రెండు గంటలు కోతలు పెడుతున్నారు. వరి పంటను సాగు చేసుకున్నాం. పగటికే పరిమితం చేస్తే పంటలు పండించుకోలేం.

– తెలుగు సోమన్న, రైతు, గట్టు

పంటలు ఎలా పండించుకోవాలి



కౌలుకు 6 ఎకరాలు, సొంతంగా 2 ఎకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో మిరప, 3 ఎకరాల్లో పత్తిని సాగు చేశాం. 2 ఎకరాల్లో నాటు వేయాల్సి ఉంది. విద్యుత్ కోతల కారణంగా ఇప్పటికి నాటు వేసుకోలేదు. రాత్రి పూర్తిగా సరఫరాను నిలిపి వేశారు. పగలు కూడా కోతలు పెడుతున్నారు. పంటలు ఎట్లా పండించుకోవాలో అర్థం కావడం లేదు.

– పూజారి వీరేష్, రైతు, రాయాపురం

బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



జోగుళాంబ ఆలయంలో మంత్రి సత్యవతిరాథోడ్‌కి స్వాగతం పలుకుతున్న అర్చకులు

దేశాభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర గిరిజన అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. సోమవారం ఆమె అలంపూర్‌లోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను దర్శించుకున్నారు. అలాగే, సఖి సెంటర్, చిల్డ్రన్ హోం, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితర వాటి పనితీరుపై అధికారులతో సమీక్షించారు.

వివరాలు 10లో..


బిజినేపల్లి మండలం వట్టెం వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు


నాగర్‌కర్నూల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


వనపర్తి ఆలయంలో భక్తుల పూజలు


యువతి భక్తిపారవశ్యం..


జడ్చర్లలో స్వామివారికి హారతి ఇస్తున్న పూజారి

ముక్కోటి దండాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివారు భక్తులకు ఉత్తరద్వార దర్శనభాగ్యం కల్పించారు. మన్యంకొండ, అమ్మాపురంలోని కురుమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కాటన్ మిల్లు వేంకటేశ్వరస్వామి, పాతగంజి లక్ష్మీనర్సింహస్వామి, జడ్చర్లలోని వేంకటేశ్వరస్వామి, మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి, ప్రధాన ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, ఆశీర్వదిస్తున్న పూజారి


మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రంలో..


మహబూబ్‌నగర్ పాతగంజి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..


మహబూబ్‌నగర్‌లోని కాటన్‌మిల్లు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి

పెద్దకొత్తపల్లి: విద్యుదాఘాతానికి గురై కొల్లాపూర్ మండలానికి చెందిన కూలీ ఊశన్న(47) మృతి చెందినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. దినసరి కూలీ కోసం ఊశన్న ఫ్లెక్సీలను ముష్టిపల్లి నుంచి పెద్దకార్పాములకు డీసీఎంలో వేసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడ్డాడు. అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరగలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ..

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ముద్దమల్ల చెన్నమ్మ (32) మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వంగూర్ మండలం కోనాపూర్ చెందిన చెన్నమ్మతో పాటు బంధులు ఆటోలో మైసిగండిలో నిర్వహించిన శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో పెద్దాపూర్ సమీపంలో ఆటో ఆపారు. ఈ క్రమంలో చెన్నమ్మ రోడ్డుదాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. చెన్నమ్మకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త శ్రీనుతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

బాలానగర్: రాజాపూర్- తిర్మలాపూర్ రహదారిపై మోపెడ్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజాపూర్ మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతలో కూరగాయలు అమ్ముకుని నవాబుపేట మండలం కూచూరుకు చెందిన లింగం (40) తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

గద్వాల క్రైం: హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు అయిదు సంవత్సరాల కఠినకారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్పీ రంజన్‌రతన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజోళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడమొర్సుకి చెందిన కుర్వ లక్ష్మీనారాయణ తన వ్యవసాయ పొలానికి రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం వద్ద నీళ్ల మళ్లింపునకు వెళ్లాడు. అయితే అక్కడే ఉన్న కుర్వ గోకారి, కుర్వ కాశన్నలు అడ్డుపడి గొడవపడ్డారు. ఈ క్రమంలో అతడిపై ఇద్దరు కలిసి తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరిపై 2018లో కేసు నమోదు చేశారు. అయితే వాదోపవాదనలు విన్న జడ్జి సాక్షులను విచారించి సోమవారం నిందితులకు 5సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా వేస్తూ.. తుది తీర్పును వెల్లడించినట్లు తెలియజేశారు.

జనసంద్రంగా మన్యంకొండ


అలంకరణలో స్వామివారు


శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం సోమవారం జనసంద్రమైంది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి కొన్ని వేల మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకారోత్సవం, వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమైంది. దేవస్థానం ముందున్న కోనేరు నుంచి గర్భగుడి వరకు భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరడంతో జనసంద్రమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే దేవస్థానం పక్కనున్న శివాలయం, అలివేలు మంగ తాయారు దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు స్వామివారికి తలనీలాలు సమర్పించారు.

■ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారి శేషవాహనసేవ నిర్వహించారు. శోభాయామానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న సభామండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానంద చారి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి కిటకిట..


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిగిరులు భక్తులతో కిటకిటలాడాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయానే సిబ్బంది ఆలయాన్ని శుద్ధి చేసి పూలమాలలతో అలంకరించారు. అనంతరం భక్తులకు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన స్వామివారిని దర్శించుకొని తరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అప్పంపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

కృష్ణా: మాగనూర్ మండలంలోని పుంజనూర్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ వివాహిత బహిర్భూమికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వివాహితుడు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడని బాధితురాలి సోదరుడు సోమవారం విలేకరులకు తెలియజేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతిరోజు మాదిరిగానే ఆదివారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామం పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లింది. కాగా ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వివాహితుడు ఈమెను వెంబడించి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడని, ఆమె పెద్దగా కేకలు వేస్తూ.. ఇంటికి పరిగెత్తుకు వచ్చి భర్తకు, కుటుంబ సభ్యులకు తెలియజేసిందని చెప్పారు. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి వారు నిందితుడిని వెదికినా కనిపించలేదని తెలిపారు. బాధితురాలికి భర్తతో పాటూ ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. ఈ విషయంపై తమ కుటుంబ సభ్యులతో కృష్ణా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ విజయభాస్కర్‌ను తెలియజేశారు.

భూ తగాదాలతో వ్యక్తిపై దాడి

● 9మందిపై కేసు నమోదు

పాన్‌గల్: భూ తగాదాలతో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటనలో 9మందిపై కేసు నమోదైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోప్లాపూర్‌లో భూమి విషయంలో దాయాదులు శ్రీరాములు అతని సోదరుడు కృష్ణయ్య, పాలివారికి భూతగాదాలు ఉన్నాయి. శ్రీరాములు పొలం పనులు చేస్తుండగా అతని అన్న కృష్ణయ్య, కుమారులు రాఘవేందర్, శివకుమార్, భార్య భాగ్యమ్మ పాలివారు నారాయణ, తిరుపతయ్య, బాలస్వామి, ఆంజనేయులు కలిసి శ్రీరాములుపై కట్టెలతో దాడి చేసి గాయపర్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధితుడి తండ్రి తిరుపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీచుపల్లిలో కేసీఆర్ వియ్యంకుడి అస్థికలు నిమజ్జనం


అస్థికలకు పూజలు చేస్తున్న హరినాథ్ రావు కుమారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కృష్ణానదిలో సోమవారం సీఎం కేసీఆర్ వియ్యంకుడు, మంత్రి కేటీఆర్ మామ పాకాల హరినాథ్‌రావు అస్థికలను కుటుంబసభ్యులు నిమజ్జనం చేశారు. ఇటీవలె అనారోగ్యంతో పాకాల హరినాథ్ రావు మృతిచెందగా.. సోమవారం ఆయన కుమారులు రాజేంద్ర ప్రసాద్, శైలేంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి బీచుపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు అనిల్‌శర్మ ఆధ్వర్యంలో కృష్ణానది తీరాన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అస్థికలను నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం, మార్కెట్‌యార్డు చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వరెడ్డి, కృష్ణ సాగర్, సుధాకరెడ్డి, శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

కల్వకుర్తిలో కలకలం


యువకుడితో పాటుగా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

● సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోస్టులు
● యువకుడితో పాటుగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి: సోషల్ మీడియాలో యువకుడి మతమార్పిడిపై వచ్చిన పోస్టులు కల్వకుర్తి పట్టణంలో తీవ్ర కలకలం రేపాయి. తన కుమారుడు 25 రోజులుగా కనిపించటం లేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలిలా.. కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసం ఉండే భాస్కరాచారి, భారతి కుమారుడు శివరామాచారి ఎనిమిదేళ్లుగా స్థానికంగా కూరగాయల మార్కెట్‌లోని విక్కీ వద్ద గుడ్డ దుకాణంలో పనిచేస్తున్నాడు.అతను దుకాణ యజమాని దగ్గరే ఉంటూ రెండు నెలలుగా ఇంటికి అడపాదడపా వచ్చేవాడు. డిసెంబర్ 8వ తేదీ నుంచి తమ కుమారుడు ఇంటికి కూడా రావటం లేదని దుకాణ యజమానిని గట్టిగా నిలదీస్తే అతను సమాధానాన్ని దాట వేశాడు. దీంతో వారు శివరామాచారికి ఫోన్ చేయగా పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో.. అనుమానం వచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు విచారణ ప్రారంభించిన పోలీసులకు శివరామాచారి విజయవాడలో ఉన్నట్లుగా గుర్తించి అతనిని కల్వకుర్తికి తీసుకొచ్చారు.

ఎమ్మార్వో ముందు బైండోవర్

కాగా, శివరామాచారిని కల్వకుర్తి తహసీల్దార్ రాంరెడ్డి ముందు పోలీసులు బైండోవర్ చేశారు. అనంతరం యువకుడి తల్లిదండ్రుల పూచీకత్తుతో వారికి యువకుడిని అప్పగించారు. ఎస్పీ మనోహర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే అసత్య వార్తలను, పోస్టులను ఎవరూ ప్రోత్సహించవద్దని తెలిపారు. అలాంటి వార్తల వల్ల ప్రశాంతంగా ఉండే వాతావరణం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తుందన్నారు. ప్రజలందరూ అలాంటి అవాస్తవాలను ప్రచారం చేయకుండా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ప్రేమ వ్యవహారమే కారణమా..

మతమార్పిడి ఆరోపణల కలకలం నేపథ్యంలో ఎస్పీ మనోహర్ కల్వకుర్తికి వచ్చి యువకుడితో పాటుగా తల్లిదండ్రులతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల విచారణ సమయంలో శివ తాను పనిచేసే దుకాణ యజమాని బంధువుల యువతితో ప్రేమలో ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. ఆ యువతిపై అమితమైన ప్రేమతో అవసరమైతే ఆమెతో పాటుగా వారి మతంలోకి వెళ్లేందుకు ఇష్టమని సదరు యువకుడు చెప్పాడు. కొన్ని రోజులుగా ఇతర రాష్ట్రాలలో జరిగే మత ప్రార్థనలకు నిత్యం వెళుతున్నానని, డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన ప్రార్థనల కోసమే వెళ్లినట్లు చెప్పారు. తాను ఎక్కడా తప్పిపోలేదని పేర్కొన్నాడు.

గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ మృతి


రఘు(ఫైల్)

బల్మూర్: మండలంలోని నాగర్‌కర్నూల్‌-అచ్చంపేట ప్రధాన రహదారిలో మహాదేవ్‌పూర్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ లాడెసాని రఘు(35) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. ఇదే మండలంలోని రామాజిపల్లి చెందిన రఘు జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ 31న శనివారం రోజు రాత్రి అచ్చంపేట నుంచి తన బైకుపై విధులకు నాగర్‌కర్నూల్ వెళ్తుండగా, మహదేవ్‌పూర్ మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. సోదరుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడి రిమాండ్

వనపర్తి క్రైం: అనుమతి లేకుండా హైకోర్టులో పిటిషన్ వేసి ప్రభుత్వాన్ని, ఫిర్యాదుదారులను మోసం చేసిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యను సోమవారం వనపర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. నాగారం ముష్టి నాగేశ్వర్ సర్వే నం.200లో పూర్వీకులకు సంబంధించిన 3 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. అయితే మెడికల్ కాలేజీ, ఇతర ప్రభుత్వ నిర్మాణాల క్రమంలో ఆ భూమిని ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. వీరికి ప్రత్యామ్నాయం చేసే క్రమంలో వెంకటయ్య తన రాజకీయ పలుకుబడితో కోర్టులో కేసు వేసి గెలిపిస్తానని నమ్మించి నాలుగేళ్ల క్రితం జగత్‌పల్లి యాదగిరి, ముష్టి గోపాల్, ఆంజనేయులు, నాగన్న, రాములు, శ్రీనివాసులు వద్ద ఆధార్ కార్డులు, సంతకాలు తీసుకున్నాడు. బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని కలెక్టర్ హామీ ఇవ్వగా.. వెంకటయ్య పరిహారం తీసుకోనివ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. అలాగే హైకోర్టు అనుమతి లేకుండానే రీపిటిషన్ దాఖలు చేశారు. ఇందులో చనిపోయిన ముష్టి ఆంజనేయులు, ముష్టి నాగన్నను పిటిషనర్లుగా చేర్చారు. దీంతో వారికి కాంపెన్సేషన్ రాకుండా, అనుమతి లేకుండా హైకోర్టులో పిటిషన్ వేయించిన వెంకటయ్యపై గతేడాది డిసెంబరు 19న పోలీసులు కేసు నమోదుచేశారు. విచారణలో చనిపోయిన వారి పేర్లతో పిటిషన్ వేసింది నిజమేనని తేలడంతో సోమవారం అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

నిలువెత్తు నయవంచన

- భారీ కానుక ఇస్తామంటూ టోకెన్లు పంచి మరీ జనాన్ని రప్పించిన బాబు
- 4 గంటలకు పైగా వేచి చూసేలా చేసి.. తరవాత ఇస్తామంటూ మోసం

- దాంతో ఆందోళన చెంది... తోసుకుంటూ ప్రాణాలు కోల్పోయిన నిరుపేదలు
- సభకు అనుమతి కోరింది టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు:

కానుకలంటూ ఆశ పెట్టి రప్పించిన
అక్క చెల్లెమ్మల్లకు వెన్నుపోటు పొడిచారు!
రూ.300 నాసిరకం వస్తువులను
రూ.వేల విలువైనవంటూ ఊరించారు!!
చివరకు అవి కూడా ఇవ్వకుండా
ఐదు గంటల పాటు నిర్బంధించారు!!
ఆ మోసాన్ని భరించలేక కుప్పకూలిన
మహిళల చావుకు చంద్రబాబు కారకుడయ్యారు!

ప్రచార వ్యామోహం.. పేదల ప్రాణాలంటే లెక్కలేనితనం.. నిలువెత్తు నిర్లక్ష్యానికి మూడు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. గుంటూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం ఆ పార్టీ కనుసన్నల్లోనే జరిగింది. సభ నిర్వహణకు పోలీస్‌శాఖకు దరఖాస్తు చేసుకోవటం నుంచి సంబంధిత చలాన్ల చెల్లింపు వరకు ఏర్పాట్లన్నీ టీడీపీ నేతలే స్వయంగా పర్యవేక్షించారు. ఉయ్యూరు ఫౌండేషన్ పేరుతో తెరచాటున వ్యవహారాలు నడిపించారు. చంద్రన్న కానుక పంపిణీలో పాల్గొనాలంటూ పది రోజులు ముందు నుంచే పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. నిత్యం సభా ప్రాంగణాన్ని సందర్శిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ పిలుపునిచ్చారు. రెండు రోజుల ముందు ఇంటింటికి తిరిగి మహిళలకు కూపన్లు ఇవ్వడంతో పాటు ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్నారు. రూ.మూడు వేల విలువైన కానుకలు అందచేస్తున్నామంటూ ఊరించారు. చివరకు తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన మరుక్షణమే అది ఓ ప్రైవేట్ కార్యక్రమమని, స్వచ్ఛంద సంస్థను ప్రోత్సహించేందుకు వెళ్లానని, తమ పార్టీకి దాంతో సంబంధం లేదంటూ స్వరం మార్చి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని మరోసారి చాటుకున్నారు. తాను స్వయంగా పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు పేద మహిళలు మృత్యువాత పడితే కనీసం పరామర్శించేందుకు కూడా ఆయనకు మనసు రాలేదు. కందుకూరులో బాధితుల వద్దకు వెంటనే వెళ్లిన ఆయన గుంటూరులో మాత్రం చనిపోయింది పేద మహిళలు కావడంతోనే మొహం చాటేసి హైదరాబాద్ వెళ్లిపోయినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన అనంతరం రాత్రి నుంచి పరారీలో ఉన్న ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాస్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


అనుమతి కోరుతూ ఇచ్చిన దరఖాస్తు

దరఖాస్తులో కానరాని "కానుకలు"

గుంటూరు ఓల్డ్ వికాస్ క్యాంపస్‌లో మాజీ సీఎం చంద్రబాబు పాల్గొన్న సభకు అనుమతుల కోసం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ స్వయంగా గుంటూరు సౌత్ డీఎస్పీకి దరఖాస్తు చేసుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పది వేల మందితో సభ నిర్వహించుకుంటామని అందులో పేర్కొన్నారు. అయితే అందులో ఎక్కడా చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొనలేదు. అది కేవలం చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమం అయితే అన్నగారి జనతా వస్త్రాలు – చంద్రన్న సంక్రాంతి కానుక అని ఎందుకు పేరు పెట్టారు? సభ నిర్వహణ అనుమతుల కోసం టీడీపీ తరపున పోలీస్ శాఖకు ఎలా దరఖాస్తు చేశారు? పార్టీ కార్యక్రమంగా ఎందుకు మార్చారు? స్వచ్ఛంద సంస్థ కార్యక్రమానికి టీడీపీ నాయకులు జన సమీకరణ ఎందుకు చేశారని బాధితులు నిలదీస్తున్నారు. రాజకీయ పార్టీకి కొమ్ము కాసే ట్రస్టుల గుర్తింపును రద్దు చేయడంతోపాటు నిధుల సేకరణపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల సూచనలు బేఖాతర్..

ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం కావడంతో అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యాంపస్‌కు ఎంట్రన్స్, ఎగ్జిట్ ఒకే గేటు ఉండటంతో మూడు చోట్ల ప్రహరీ పగలగొట్టించి ద్వారాలు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు బారికేడ్లు ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారు. వ్యక్తిగత కార్యక్రమానికి నిర్వాహకులే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. పోలీసులు వాటిని పరిశీలించి పలు సూచనలు చేసినా నిర్వాహకులు పట్టించుకోలేదు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల మహిళలను కానుకలు పంపిణీ చేస్తామంటూ వాహనాల్లో మీటింగ్ ప్రదేశానికి తరలించారు. రాగానే వాటిని అందచేస్తే తొక్కిసలాటకు అవకాశం ఉండేది కాదు. కానుకలు ఇస్తే మహిళలు వెళ్లిపోతారనే భయంతో చంద్రబాబు సభ ముగిసేవరకు సాయంత్రం ఆరు గంటల దాకా బలవంతంగా కూర్చోబెట్టారు. చంద్రబాబు సభ జరుగుతున్న సమయంలో పరిస్థితిని గమనించిన పోలీసులు వెంటనే కిట్‌ల పంపిణీ ప్రారంభించాలని వేదికపై ఉన్న నాయకులను ఫోన్‌లో కోరారు. ఓ ట్రాఫిక్ సీఐ వేదికమీదకు వెళ్లి మరీ పరిస్థితిని వివరించినా ఆలకించలేదు. బారికేడ్లు సరిగా లేకపోవడంతో తొక్కిసలాటలో ఒరిగిపోయాయి. పోలీసులు సకాలంలో స్పందించి కానుకల పంపిణీని నిలిపివేసి తొక్కిసలాటలో చిక్కుకున్నవారిని కాపాడటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. లేదంటే పదుల సంఖ్యలో మరణాలు ఉండేవని బాధితులు చెబుతున్నారు.

237 మందితో బందోబస్తు..

నూతన సంవత్సర వేడుకలతోపాటు మంగళగిరి, తెనాలిలో వైకుంఠద్వార దర్శనం బందోబస్తుకి పెద్ద సంఖ్యలో పోలీసులను సమకూర్చాల్సి వచ్చినా చంద్రబాబు సభకు ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో 207 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పరిస్థితి గమనించి మరో 30 మంది సిబ్బందిని అదనంగా రప్పించారు. వీరంతా ఉండబట్టే పరిస్థితి వెంటనే అదుపులోకి వచ్చింది. ముందు జాగ్రత్తగా పోలీసులు రెండు అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేశారు. ప్రైవేట్ కార్యక్రమం అయినప్పటికీ బాధ్యతగా వ్యవహరించారు. ప్రైవేట్ కార్యక్రమాల్లో బందోబస్తు కోసం పోలీసుశాఖకు యూజర్ చార్జీలను చెల్లించాలి. టీడీపీ నాయకులు ఆ పని చేయకపోగా పోలీసులపైనే ఆరోపణలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనీస పశ్చాత్తాపం కరువు

చంద్రబాబు అరగంటకు పైగా మాట్లాడి నలుగురికి చంద్రన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన వెళ్లిపోయిన నిమిషాల వ్యవధిలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ సమయానికి చంద్రబాబు కాన్వాయ్ మంగళగిరి కూడా చేరుకోలేదు. కొందరు నేతలు ఈ విషాదం గురించి ఆయనకు సమాచారం ఇవ్వడంతో మీరే చూసుకోవాలని స్పష్టం చేసి విమానాశ్రయానికి వెళ్లిపోయినట్లు తెలిసింది. రాత్రి 7.02కి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న ఆయన 7.59 నిముషాలకు ఇండిగో విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. తాను పాల్గొన్న కార్యక్రమంలో ముగ్గురు మహిళలు చనిపోవడంతోపాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారనే విషయం తెలిసి కూడా కనీస మానవత్వం, పశ్చాత్తాపం లేకుండా చంద్రబాబు వెళ్లిపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. బాధిత కుటుంబాలను జీజీహెచ్‌లో స్థానిక నేతలు మినహా అధినాయకత్వం పరామర్శించిన పాపాన పోలేదు.

పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు ఘటనలో తల్లిని కోల్పోయిన ఏటీ అగ్రహారం 4వ లైనుకు చెందిన గోపిదేశి నాగరాజు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ శ్రీనివాసరావుపై 304 క్లాజ్ 2, 34 ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని ఫోన్ సిగ్నల్స్, నెట్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టిన సీసీఎస్ పోలీసులు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాబు కీలుబొమ్మ 'ఉయ్యూరు'

తమకు అత్యంత సన్నిహితుడైన ఎన్నారై ఉయ్యూరు శ్రీనివాస్ ద్వారా సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని చంద్రబాబు, లోకేశ్ నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడిగా తెరపైకి తెచ్చిన ఉయ్యూరు శ్రీనివాస్ టీడీపీలో క్రియాశీల నేత. పార్టీ జెండా మోసిన నేతలను పక్కనబెట్టి విదేశాల నుంచి డబ్బు సూట్‌కేసులతో దిగే ఎన్నారైలను ఎన్నికల బరిలోకి దింపాలని భావిస్తున్న చంద్రబాబు కొంతకాలంగా ఉయ్యూరు శ్రీనివాస్‌ను ప్రోత్సహిస్తున్నారు. గుంటూరు వెస్ట్, పొన్నూరు నియోజకవర్గాల్లో టికెట్ ఆశ చూపిస్తూ ఆయన ద్వారా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే కొత్త సంవత్సరం సందర్భంగా చంద్రబాబుకు మీడియాలో ప్రచారం కల్పించేందుకు గుంటూరులో తాజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌పై విద్వేషపూరిత పోస్టులు

టీడీపీ తరపున సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఉయ్యూరు శ్రీనివాస్.. సీఎం జగన్, మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలపై విద్వేషపూరిత పోస్టులు పెడుతుంటాడు. లోకేశ్ ఆధ్వర్యంలో నడిచే టీడీపీ సోషల్ మీడియా విభాగం సూచనల మేరకు వర్గ విభేదాలు రెచ్చగొట్టేలా, ఘర్షణలను ప్రేరేపించేలా వ్యవహరిస్తుంటాడు.



స్వర్ణరథంపై సర్వాంతర్యామి

తిరుమలలో వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవం

తిరుమల/మంగళగిరి/సింహాచలం/శ్రీశైలం టెంపుల్/నెల్లిమర్ల: ఇల వైకుంఠం తిరుమలలో సోమవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సర్వాంతర్యామి అయిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామ స్మరణతో సప్తగిరులు పులకించాయి. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన అనంతరం వైకుంఠ ఏకాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామాన్య భక్తులకు సైతం గంట ముందుగానే ఆరు గంటలకే సర్వదర్శనం ప్రారంభించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు చేరుకున్న అశేష భక్తవాహిని స్వర్ణరథ వాహనసేవను తిలకించి స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. మహిళా భక్తులు ఉత్సాహంతో స్వర్ణరథాన్ని లాగారు.

రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధం

ప్రజల భద్రత కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రహదారులపై బహిరంగ సభలు, ర్యాలీలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఇకపై జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులపైన, మార్జిన్లలో సభలు, ర్యాలీలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అత్యంత అరుదైన సందర్భాల్లో జిల్లా ఎస్పీలు లేదా పోలీస్ కమిషనర్లు కచ్చితమైన షరతులతో అనుమతి ఇవ్వొచ్చని మినహాయింపునిచ్చింది. ఈమేరకు హోం శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1861 పోలీస్ చట్టం ప్రకారం హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతోపాటు, వాటి నిర్వహణలో లోటుపాట్లు, నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నేపథ్యంలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

నిరాహార దీక్ష విరమించిన జోగయ్య

ఏలూరు టౌన్: కాపులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి హరిరామ జోగయ్య చేపట్టిన నిరాహార దీక్షను సోమవారం విరమించారు. పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి మేరకు దీక్ష విరమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కాపులకు రిజర్వేషన్‌పై హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. కాగా పాలకొల్లులో ఆయన స్వగృహంలో ఆదివారం రాత్రి జోగయ్యతో చర్చించిన పోలీసులు దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఏలూరు కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. కాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఆహారం తీసుకునేందుకు, మందులు వేసుకునేందుకు హరిరామ జోగయ్య నిరాకరించారు.

మరిన్ని వార్తలకు
ఈ క్యూఆర్ కోడ్‌ను
స్కాన్ చేయండి

దేశం గర్వించదగ్గ నేత కేసీఆర్

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



నవాబుపేట: దేశం గర్వించదగ్గ నాయకుడిగా కేసీఆర్ ఎదిగారని, ఆయన సారథ్యంలో చేపట్టిన పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆయన స్వగ్రామంలో తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, అభిమానులతో మాట్లాడారు. తెలంగాణ మోడల్‌గా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకే కేసీఆర్ బీఆర్‌ఎస్ స్థాపించారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కొనే సమర్థత గల నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాగా తన సోదరుడు మన్నె వెంకట్రామరెడ్డి 20 రోజుల క్రితం మృతి చెందడంతో జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మంత్రాలయంలో మూడు మొక్కలు నాటినట్లు వివరించారు. ఎంపీని కలిసిన వారిలో సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, నవాబ్‌పేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ప్రతాప్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో నిర్వహించిన జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పలువురు బాలబాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అడ్‌హక్ కమిటీ కన్వీనర్ శంకర్‌నాయక్ తెలిపారు. బాలికల విభాగంలో 16 మంది, బాలుర విభాగంలో 16 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి 6 వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలికలు, 7 నుంచి 9 వరకు నిజామాబాద్‌లో జరిగే పోటీల్లో బాలురు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, బీఎస్పీ నాయకులు బాలవర్ధన్‌గౌడ్, నవీన్‌రెడ్డి, హైమావతి తదితరులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు
- సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష
- రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి సత్యవతి రాథోడ్

జోగుళాంబ శక్తిపీఠం /అలంపూర్ రూరల్: దేశాభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర గిరిజన అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం ఆమె శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బెక్కం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వైకుంఠ ఏకాదశి కావడంతో ఆమె శైవ, శక్తిక్షేత్రాన్ని ఉత్తరద్వారం గుండా దర్శించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల సందర్భంగా ఆమె ముందుగా సీఎం కేసీఆర్ గోత్ర నామాలతో పూజలు చేయించడం గమనార్హం. ఆలయ చైర్మన్ మంత్రికి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ దేశం అభివృద్ధిలో వెనుకబాటుకు బీజేపీ కారణమన్నారు. అందుకే దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను స్థాపించారని చెప్పారు.


ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

అధికారులతో సమీక్ష

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా అంగన్‌వాడీ కేంద్రాలలో పేద గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ బలోపేతం చేసిందని, రాష్ట్ర గిరిజన అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సఖీ సెంటర్, భరోసా, చైల్డ్‌లైన్, బాల్యవివాహాలు, చిల్డ్రన్‌హోమ్ తదితర అంశాల పై సమీక్షించారు. పలుఅంశాలపై ఆరా తీశారు. 1098, 181 వంటి అత్యవసర ఫోన్ నెంబర్లను అందరికీ తెలియజేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, శిశు సంక్షేమ శాఖ అధికారి ముషాయిదాబేగం, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్, చైర్మన్ సహదేవ్, డీడబ్ల్యూఓ హేమలత ఉన్నారు.

మా బిడ్డ ప్రాణాలు కాపాడండి

- తల్లిదండ్రుల వేడుకోలు

లింగాల: క్యాన్సర్‌తో తల్లడిల్లుతున్న తమ రెండో కుమార్తె 9 సంవత్సరాల వయసున్న రేణుక ప్రాణాలను కాపాడాలని నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అప్పాయపల్లికి చెందిన రేణయ్య, లక్ష్మమ్మలు దాతలను వేడుకుంటున్నారు. ఏడాది కాలం నుంచి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతుందని, నిలోఫర్, మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా.. నయం కాలేదని తల్లిదండ్రులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి ఇప్పటి వరకు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశామని, రోగాన్ని నయం చేసుకోవడానికి ఆర్థిక స్థోమత లేక కుమార్తెను ఇంటి వద్దనే ఉంచుకున్నట్లు వాపోయారు. మానవతావాదంతో మెరుగైన వైద్యం కోసం దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి బిడ్డ ప్రాణాలు కాపాడాలని వారు వేడుకుంటున్నారు. 6302571601కు సాయం అందించాలని కోరారు.


క్యాన్సర్ బారిన పడిన కుమార్తెతో తల్లిదండ్రులు

నేటితో ముగియనున్న దేహదారుఢ్య పరీక్షలు


ఎత్తు చూస్తున్న సిబ్బంది


లాంగ్‌జంప్ దూకుతున్నయువకుడు

- అర్హత సాధించిన 14,217 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ క్రైం: డిసెంబర్ 8నుంచి ప్రారంభమైన ఎస్‌ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు నేడు(మంగళవారం)తో ముగియనున్నాయి. దాదాపు 21రోజుల పాటు జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో ఈవెంట్స్ కొనసాగాయి. ఎస్పీ వెంకటేశ్వర్లు, ఐపీఎస్ అధికారి చేతన, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షణలో దేహదారుఢ్య పరీక్షలు సజావుగా నిర్వహించారు. ఈ పరీక్షల కోసం దాదాపు 100మంది పోలీస్ సిబ్బంది పనిచేశారు. ఇప్పటివరకు జరిగిన ఈవెంట్స్‌కు 22,373 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 20318 మంది హాజరయ్యారు. 2,055మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇక ఈవెంట్స్‌కు హాజరైన అభ్యర్థుల్లో 14,217 మంది తుది రాతపరీక్షకు అర్హత సాధించగా 6,101మంది వెనుతిరిగారు. అర్హత పొందని దాంట్లో అత్యధికంగా 1600పరుగు పోటీలో 3,476మంది ఉన్నారు. ఎత్తులో 1,116, లాంగ్‌జంప్‌లో 1,030, షాట్‌పుట్‌లో 479మంది అర్హత పొందలేకపోయారు.

950మంది ఎంపిక..

జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో సోమవారం జరిగిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు 1,472 మంది హాజరుకావాల్సి ఉండగా 1,354మంది హాజరుకాగా 118మంది గైర్హాజరయ్యారు. వచ్చిన అభ్యర్థులకు మొదట సర్టిఫికెట్లు పరిశీలన చేసి, ఆ తర్వాత 1600పరుగు పోటీలు నిర్వహించారు. దీంట్లో 1,074 మంది అర్హత పొందగా 280మంది అర్హత సాధించలేకపోయారు. ఇక ఎత్తులో 1,018మంది, లాంగ్‌జంప్‌లో 984, షాట్‌పుట్‌లో 950మంది అర్హత సాధించారు. ఇక తుదిరాత పరీక్ష కోసం 950మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పాల్గొన్న 1354 మందిలో 404మంది అర్హత సాధించలేదు.

దొంగకు రెండేళ్ల జైలు శిక్ష

కొల్లాపూర్: దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తికి కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్‌కే వెంకటరమణ సుహాస్ రెండేళ్ల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. కర్నూలు జిల్లా పాణ్యంకు చెందిన పొంతగిరి నాగార్జున అనే దొంగ 2021 మే 9వ తేదీన సింగోటంలోని రత్నలక్ష్మీ అమ్మవారి గుడిలో చోరీకి పాల్పడ్డాడు. ఆలయంలోని హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లాడు. అతడిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ బాలవెంకటరమణ, కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణలు వెల్లడించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి మెజిస్ట్రేట్ రెండేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించినట్లు వారు తెలిపారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు పాలమూరు క్రీడాకారులు


గాయత్రి


ఎంఎ కైఫ్


మహ్మద్ మీర్జా బేగ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఢిల్లీలో మంగళవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు జరగనున్న 44వ సబ్ జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. ఈ టోర్నీలో గాయత్రి, ఎంఎ కైఫ్, మీర్జా మహ్మద్ బేగ్ తెలంగాణ రాష్ట్ర జట్లకు ప్రాతినిథ్యం వహించనున్నారు. వీరి ఎంపికపై జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.శాంతికుమార్, మహ్మద్ హనీఫ్‌తో పాటు ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

వారణాసిలో కూచిపూడి ప్రదర్శన


వారణాసిలో కూచిపూడి ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినులు

జడ్చర్ల: ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన ఆజాదిక అమృత్ మహోత్సవాల సాంస్కృతిక వేడుకలలో పట్టణంలోని సాయికృప కళా క్షేత్రం బాలికలు కూచిపూడి నృత్యం ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచారు. డిసెంబర్ 24వ తేదీ నుంచి జనవరి 2 వరకు నిర్వహించిన వేడుకల్లో అక్షయ, పరిమళ, మనస్విని, లక్ష్మిప్రసన్న ఇతర విద్యార్థులను హాజరయ్యారు. నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించినట్లు నిర్వాహకురాలు బింధుమాదవి తెలిపారు.

పశువుల అపహరణ నిందితునికి రిమాండ్

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన ముద్దం శివకు సంబంధించిన రెండు ఏద్దులు, ఒక ఆవు, రెండు దూడలు ఆదివారం సాయంత్రం చోరీఅయ్యాయి. సోమవారం ఈ సంఘటనపై యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు. విచారణ చేసి నిందితుడిని గుర్తించి రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఎస్సై కథనం ప్రకారం.. ముద్ద శివ ఆదివారం రోజువారీగా పశువులను తన పొలంలోని కొట్టం వద్ద ఉంచి ఇంటికి వచ్చాడు. తిరిగి సాయంత్రానికి వెళ్లి చూడగా పశువులు కన్పించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ సీఐ హన్మంతు సహాయంతో సంఘటనా స్థలం వద్ద విచారణ చేపట్టారు. ఈవిచారణలో అదే గ్రామానికి చెందిన గుంట మధు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.